సాక్షి వికారాబాద్

మంగళవారం । 11 । జూలై । 2023



కంకర పరిచారు..

కంకర రోడ్డుపై ప్రయాణమంటేనే వాహనదారులు హడలెత్తుతున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. 8లో▸



ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

బీఆర్‌ఎస్ పాలనలోనే ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 8లో▸



వీవీలు రెన్యూవల్ అయ్యేనా?

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో విద్యావలంటీర్ల ఏర్పాట్లుపై స్పష్టత రావడం లేదు. 9లో▸



• అధ్వానం

పంచాయతీ కార్మికులు సమ్మె బాట పట్టడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది. చెత్త తరలింపును పట్టించుకునే వారే లేకుండాపోయారు. దీనికి తోడు గుంతలమయమైన రోడ్లపై వర్షపు నీరు నిలిచి, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. మురుగు కాల్వలు పేరుకుపోయి దుర్గంధం వ్యాపింపజేస్తున్నాయి. బషీరాబాద్ పంచాయతీ కార్యాలయం ఎదుట కనిపించిన రోడ్డు దుస్థితి ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.

– బషీరాబాద్



అలంకారం

తాండూరులోని భావిగి భద్రేశ్వర శివాలయంలోని స్వామివారిని సోమవారం అల్లనేరేడు పండ్లతో సుందరంగా అలంకరించారు. 108 పండ్లతో అర్చకుడు విజయ్‌కుమారస్వామి శివలింగాన్ని అందంగా ముస్తాబు చేశారు. పెద్దలింగానికి చిన్నచిన్న లింగాలను అతికించినట్లుగా దర్శనమిచ్చిన ముక్కంటీశ్వరుడు భక్తులను మైమరిపింపజేశాడు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు.

– తాండూరు



• అన్నదానం

పట్నం మహేందర్‌రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రి, మాతాశిశు ఆస్పత్రి వద్ద నిత్యాన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి తనయుడు, ట్రస్టు నిర్వాహకుడు రినీష్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్లు శోభారాణి, నీరజాబాల్‌రెడ్డి, రామకృష్ణ, రవిరాజుతో కలిసి సోమవారం తాండూరులో అన్నదానాన్ని ప్రారంభించారు. పేదలు, రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సామాజిక కార్యకర్త నజీర్‌ను సన్మానించారు.

– తాండూరు టౌన్

న్యూస్‌రీల్

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రశాంత వాతావరణం



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేయిస్తున్న మనోహర్‌రెడ్డి

దోమ: ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఉదన్‌రావుపల్లి హనుమాన్ ఆలయంలో సోమవారం ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్య, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, గొడుగోనిపల్లి సర్పంచ్ అంజనేయులు, ఐనాపూర్ ఎంపీటీసీ ఆంజనేయులు, జనార్దన్‌గౌడ్, భద్రి, రఘు, మొహన్‌రెడ్డి, పవన్ యాదవ్, గోవర్ధన్, అఖిల్, తిరుపతి, నవీన్, నర్సింలు, రాములు, అబి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న జాతీయ పెన్షన్ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, ఎల్ఐసీ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు జంగయ్య తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులకు సామాజిక భద్రతకు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. చందాలతో కూడిన జాతీయ పెన్షన్ విధానంలో కనీస పెన్షన్ గ్యారెంటీ లేదని తెలిపారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు సత్యనారాయణ, బాబురావు, పవన్ కుమార్, రత్నం, వినోద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్‌మన్ చేతివాటంపై విచారణ



వీరాపూర్‌లో విచారణ నిర్వహిస్తున్న అధికారులు

కుల్కచర్ల: విధులను నిర్లక్ష్యం చేసినా, అవినీతికి పాల్పడినా చర్యలు తప్పవని డీఆర్డీఏ ఏపీడీ నర్సింలు అన్నారు. ఆసరా పెన్షన్ల పంపిణీలో పోస్టుమన్ నర్సింలు చేతివాటం ప్రదర్శిస్తుండటంతో పాటు విధులను పట్టించుకోవడం లేదని చౌడాపూర్ మండలం వీరాపూర్, ఈర్లవాగుతండాకు చెందిన పలువురు లబ్ధిదారులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం ఎంపీడీఓ నాగవేణితో కలిసి వీరాపూర్‌లో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్ట్‌మెన్ చేతివాటం నిజమేనని.. పెన్షన్ కింద వచ్చే రూ.2,016, రూ.3,016లో రూ.16 ఇవ్వడం లేదని లబ్ధిదారులు తెలిపారు. ఒకనెల ఆసరా పెన్షన్ తీసుకోని వారు ఆ తర్వాతి నెలలో వస్తే సకాలంలో ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరాపూర్ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

ఎన్నికల కసరత్తు ముమ్మరం

ఈవీఎంల పరిశీలన పూర్తి

- జిల్లాలో 2,300 యంత్రాలు సిద్ధం
- అధికారులకు ముగిసిన శిక్షణ
- నోడల్ అధికారుల నియామకం
- ఓటింగ్ విధానంపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు
- పర్యవేక్షిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి



అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

వికారాబాద్: జిల్లాలో అధికారులు ఎన్నికల కసరత్తును వేగవంతం చేశారు. రెండు, మూడు నెలలుగా ఓటరు జాబితా ప్రక్షాళనపై దృష్టిసారించి, ఈవీఎంలను సమకూర్చుకున్నారు. పోలింగ్‌కు అవసరమైన వాటికన్నా పదిశాతం అదనంగా అందుబాటులో ఉంచారు. మొత్తం 2,300 ఈవీఎంలు అవసరమని గుర్తించిన అధికారులు అవి ఎలా పని చేస్తున్నాయి..? ఏవైనా సమస్యలున్నాయా..? అనే విషయంలో టెక్నికల్ టీంలతో చెక్ చేయించి సిద్ధంగా ఉంచారు. ఈవీఎంలను భద్రపర్చే స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ ఇప్పటికే తనిఖీ చేశారు. వారం రోజుల క్రితం కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్వహించిన సమావేశానికి వెళ్లి వచ్చిన కలెక్టర్, ఎస్పీ అప్పటి నుంచి కసరత్తును మరింత వేగవంతం చేశారు. ఇప్పటికే నోడల్ అధికారులను సైతం నియమించారు. ఢిల్లీలో శిక్షణ పొందివచ్చిన మాస్టర్ ట్రైనర్ ద్వారా స్థానిక అధికారులకు శిక్షణ ఇస్తున్నారు. తాజాగా సోమవారం కలెక్టర్ ఈవీఎంల ప్రదర్శన కూడా ప్రారంభించారు. మొదట అధికారులకు వీటిపై శిక్షణ ఇచ్చి తహశీల్దార్ కార్యాలయాల వద్ద వీటి ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం నుంచి ఎలక్షన్ డీటీలు ప్రతీ గ్రామానికి వెళ్లి ఈవీఎంల ప్రదర్శనతో పాటు మాక్ పోలింగ్ నిర్వహిస్తారు.

ఓటరు జాబితా ప్రక్షాళనపై కసరత్తు

ఓటరు జాబితా ప్రక్షాళనపై అధికారులు రెండు నెలలుగా కసరత్తు చేస్తూనే ఉన్నారు. గత 2022 జనవరితో పోలిస్తే 2023 జనవరి వరకు ఏడాది కాలంలో జిల్లాలో 40వేల మంది ఓటర్లు పెరిగారు. అయితే అదే స్థాయిలో సుమారు 36 వేల మంది ఓటర్లు వివిధ కారణాలతో జాబితా నుంచి తొలగించబడ్డారు. ఏదిఏమైనా ఇంత పెద్ద మొత్తంలో ఓటర్లను తొలగించటం ఏమిటనే విషయంలో లోతుగా ఆరా తీసిన కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులు తొలగించిన జాబితాను వెరిఫై చేయాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రధానంగా వివాహమై ఇతర గ్రామానికి వెళ్లడం,మృతి చెందటం,జిల్లా దాటి వేరే గ్రామానికి మారటం తదితర కారణాలతో ఓటరు జాబితా నుంచి తొలగించగా..ఆధార్ లింకేజీతో రెండు చోట్ల పేర్లు ఉన్నవారు అధికంగా ఉన్నట్లు తెలిసింది. వీరి ఇంటికి వెళ్లి ఓటు తొలగింపు సరైనదా..? కాదా..? అని విచారణ చేస్తున్నారు. ఎవరినైనా అకారణంగా తొలగించినట్లయితే తిరిగి నమోదు చేసుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం 451,134 మంది పురుషులు, 4,49,945 స్త్రీలు, 29 మంది ఇతరులు కలిపి మొత్తం 9,01,108 మంది ఓటర్లు ఉన్నారు.

ఈవీఎంలపై అవగాహన

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎంలు)పై జిల్లాలో మంగళవారం నుంచి చేపట్టనున్న అవగాహన కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. ముందుగా కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానం, మాక్ పోలింగ్ నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం ఒక్కో నియోజకవర్గానికి నాలుగు మొబైల్ వ్యాన్లను ఏర్పాటు చేసి అవగాహన మాధ్యమాలను ఎలక్షన్ డీటీలకు అప్పగించారు. ఇకనుంచి వీరు గ్రామాల్లోకి ఓటు వేయడంతో పాటు మాక్‌పోలింగ్ నిర్వహణపై అవగాహన కల్పిస్తారు. మొత్తం 21 ఈవీఎంల ద్వారా జిల్లాలో ఏర్పాటు చేసిన బృందాలు ఈ కార్యక్రమాన్ని చేపడుతాయి. రోజంతా ప్రదర్శన నిర్వహించి సాయంత్రం దగ్గరలోని పోలీస్ స్టేషన్లలో ఈవీఎంలను భద్రపర్చాలని కలెక్టర్ సూచించారు.

రెండు షిఫ్టులు పనిచేయాలి

జిల్లాలో అర్హులైన ఏఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అందుకే తొలగించబడిన ఓటర్ల ఇళ్లకు వెళ్లి రీవేరిఫై చేయిస్తూ జాబితాను ప్రక్షాళన చేయిస్తున్నాం. జిల్లాలో ఎలక్షన్ల డీటీలతో ఏర్పాటు చేసిన 21 బృందాలు ఉదయం సాయంత్రం రెండు షిఫ్టుల్లో పని చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తాయి. ఇందుకోసం అందరూ సహకరించాలి.

– నారాయణరెడ్డి, కలెక్టర్

భగీ'వ్యథ'!

- ఇష్టారాజ్యంగా మిషన్ భగీరథ పనులు
- నాణ్యతకు తిలోదకాలు
- పైప్‌లైన్ల నిర్మాణంలో రోడ్లు ధ్వంసం
- పునర్నిర్మాణాన్ని పట్టించుకోని కాంట్రాక్టర్లు
- అవస్థల్లో ప్రజలు

వికారాబాద్: జిల్లాలో మిషన్ భగీరథ పనులు ప్రారంభమైంది మొదలు కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు సైతం వీరికే కొమ్ము కాస్తుండటంతో నాణ్యతను విస్మరించి, మమ అనిపించేస్తున్నారు. ఇప్పటికే అనేక మంది కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు. దీంతో కొన్ని చోట్ల ఇతరులకు పనులు అప్పగించారు. మరికొన్ని చోట్ల ఎలాగైనా వీటిని పూర్తి చేయాలని సంబంధిత అధికారులు సర్పంచ్‌లకు సూచించారు. కానీ ఎక్కడా నిబంధనలు పాటించడం లేదు. పైప్‌లైన్ల నిర్మాణంలో భాగంగా రోడ్లను తవ్వేశారు. వీటికి వెంటనే మరమ్మతులు చేయాల్సి ఉన్నా అస్సలు పట్టించుకోవడం లేదు.

తూతూమంత్రంగా..

జిల్లాలోని నవాబుపేట, బంట్వారం, మర్పల్లి, పరిగి, వికారాబాద్ తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో ధ్వంసమైన రోడ్లను బాగు చేయటం లేదు. తూతూమంత్రంగా మరమ్మతులు చేసిన పలు రహదారులు కొద్ది రోజులకే గుంతలమయంగా మారాయి. ఆరు నుంచి ఎనిమిది ఇంచుల మేర నిర్మించాల్సిన రోడ్డును కేవలం రెండు ఇంచులకే పరిమితం చేశారు.

2వేల కిలోమీటర్లు ధ్వంసం

గ్రిడ్ పేరుతో పెద్ద పైపులైన్ పనులు, ఇంట్రా పేరుతో అంతర్గత పైప్‌లైన్ పనులు చేపట్టగా.. భగీరథ ద్వారా జిల్లాలోని 974 గ్రామాలకు నీరందించారు. ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం కోసం రూ.1,200 కోట్లకు పైగా వెచ్చించారు. పనుల్లో భాగంగా 2వేల కిలోమీటర్లకు పైగా అంతర్గత పైప్‌లైన్లు వేయగా రూ.415 కోట్లు అవసరమని అంచనా వేశారు.. పనుల నిర్వహణలో జాప్యం కారణంగా నిర్వహణ వ్యయం ఇంకా పెరిగిపోయింది. ఐదు సంవత్సరాలు దాటి కొనసాగుతున్న ఈ పనులకు సంబంధించి కొన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు.

త్వరలో పూర్తి చేయిస్తాం

మిషన్ బగీరథ పనులను త్వరలోనే పూర్తి చేయిస్తాం. పాడైన సీసీ రోడ్లకు మరమ్మతులు చేయించే విషయంలో కొంత ఆలస్యం జరిగిన మాట వాస్తవమే. కొందరు కాంట్రాక్టర్లు మృతి చెందటం, మరి కొన్ని చోట్ల పనులను మధ్యలో వదిలేయడంతో రోడ్ల నిర్మాణంలో జాప్యం ఏర్పడింది.

– బాబూశ్రీనివాస్, భగీరథ ఈఈ (ఇంట్రా)



నవాబుపేట మండలం అక్నాపూర్‌లో మిషన్ భగీరథ పనుల్లో భాగంగా పాడైన రోడ్డు

ప్రజావాణికి 262 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 262 మంది నుంచి ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు

- ప్రమాదంలో ఆరేళ్ల బాలిక దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆడుకోవడానికి వెళ్లిన చిన్నారి అనంతలోకాలకు చేరుకుంది. బస్సు రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. అమ్మా అంటూ బాలిక చివరి ఆర్తనాదాలు పెట్టింది. ఈ హృదయవిదారక సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. బాలాపూర్ మండలం కుర్మల్‌గూడలోని రాజీవ్‌గృహకల్పలో నివసించే మిర్యాల విజయలక్ష్మి, వేణుగోపాల్ దంపతులు. వారికి ముగ్గురు సంతానం. వారిలో పెద్ద పాప హితిషా, చిన్నపాప భావన (6), కుమారుడు భానుప్రసాద్ ఉన్నారు. మల్లాపూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో పిల్లలు చదువుతున్నారు. భావన యూకేజీ చదువుతోంది. సోమవారం ఉదయం బడికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. భావన ఆడుకోవడానికి ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. ఇంటి ముందు ఆడుకుంటుండగా బాలాపూర్‌లోని ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు (టీఎస్ 07యుజీ 3293) డ్రైవర్ చూసుకోకుండా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో భావనను ఢీకొట్టాడు. చిన్నారి తలమీద నుంచి బస్సు వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందింది.

తండా రోడ్లకు నిధులివ్వండి

అనంతగిరి: వికారాబాద్ నియోజకవర్గంలోని తాండాలకు రోడ్లు వేసేందుకు నిధులు మంజూరు చేయాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సోమవారం మంత్రి సత్యవతి రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయానికి వెళ్లి ఈ మేరకు విన్నవించారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు.



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

మొక్కల పెంపకానికి ప్రాధాన్యత



గంగారం నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: హరితహారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని హర్షగూడ, గంగారం, మహేశ్వరం, మన్సాన్‌పల్లి, ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి గ్రామాల్లో ఉన్న నర్సరీలను ఆమె ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామంలో నర్సరీ ఏర్పాటు చేసి, మొక్కలు పెంచి గ్రామంలో అవసరమైన చోట నాటుతున్నట్లు చెప్పారు. హర్షగూడలో మొక్కల సంరక్షణ సరిగ్గాలేదని పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డీపీఓకు సూచించారు. అనంతరం ఘట్టుపల్లిలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో హరితహారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

పేదల బియ్యం.. పెద్దల భోజ్యం!

- అక్రమార్కులు, వ్యాపారుల జేబులు నింపుతున్న రేషన్ రైస్
- యథేచ్ఛగా పక్క రాష్ట్రాలకు తరలింపు
- రైస్ మిల్లుల నుంచి పౌల్ట్రీలకు సరఫరా
- పట్టించుకోని సంబంధిత అధికారులు



పరిగిలో ఇటీవల పట్టుబడ్డ రేషన్ బియ్యం

పరిగి: పేదల ఆకలి తీర్చేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కులు, దళారుల జేబులు నింపుతోంది. బియ్యం దొడ్డుగా ఉండటం, నాణ్యంగా లేకపోవడంతో తినేందుకు కొందరు ఇష్టపడటం లేదు. ఇదే అక్రమార్కులకు వరంగా మారింది. ప్రతినెలా లబ్ధిదారులు తమ కోటా బియ్యాన్ని తీసుకుంటున్నా..చాలా మంది వీటిని తినడం లేదు. నేరుగా రేషన్ డీలర్లకే రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు. మరి కొందరు సమీపంలోని మిల్లులకు తీసుకెళ్లి అమ్మేస్తున్నారు. పరిగి పట్టణ కేంద్రంలో ప్రతీ శుక్రవారం నిర్వహించే సంతలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు కొనసాగుతున్నా.. పట్టించుకునే వారే లేకుండాపోయారు.

మిల్లుల్లో రీసైక్లింగ్

జిల్లాలోని 19 మండలాల్లో 588 రేషన్ దుకాణాలు, జిల్లా వ్యాప్తంగా 2లక్షల 41వేల రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా సుమారు 9వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో కొంత మంది వ్యాపారులు, మిల్లర్లు రేషన్ బియ్యాన్ని మిల్లుల్లో రీసైక్లింగ్ చేస్తున్నారు. లబ్ధిదారులు, రేషన్ డీలర్ల నుంచి నేరుగా కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి దర్జాగా దందా సాగిస్తూ పెద్ద మొత్తంలో ఆర్జిస్తున్నారు. కొంతమంది బడాబాబులు రేషన్ బియ్యాన్ని కర్ణాటక, మహారాష్ట్రాకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరికి ఓ రాజకీయ నాయకుడి అండదండలు పూర్తి స్థాయిలో ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. రేషన్ బియ్యం ఎక్కడ పట్టుబడినా ఆయన అధికారులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు యంత్రాంగం పర్యవేక్షణ లేకపోవడంతో వీరి దందాకు అడ్డు లేకుండాపోతోంది.

చర్యలు తీసుకుంటాం



రేషన్ బియ్యం అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. సబ్సిడీపై అందించే బియ్యం పక్క దారి పట్టకుండా పక్కా నిఘా ఏర్పాటు చేస్తున్నాం. రేషన్ దుకాణాల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం.రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినా, పోగు చేసినా కఠిన చర్యలు తప్పవు.

– రాజేశ్వర్, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి

ఆగని వ్యాపారం

పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎంత కట్టుదిట్టం చేసినా రేషన్ బియ్యం దందా మాత్రం ఆగడం లేదు. లబ్ధిదారులకు డబ్బు ఆశ చూపి ఇష్టానుసారంగా కొనుగోలు చేస్తున్నారు. నాలుగైదు గ్రామాలకు ఒక వ్యక్తి చొప్పున ఏర్పాటు చేసుకుని బియ్యం సేకరిస్తుండటం గమనార్హం. ఇలా సేకరించిన బియ్యాన్ని కొంత మంది వ్యాపారులు పౌల్ట్రీఫారాలకు తరలిస్తున్నారు. వీటిని కోళ్ల దాణాలో వాడుతున్నారు. అక్రమ రేషన్ దందాను ఆపేందుకు అధికారులు ఎంత ప్రయత్నించినా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా సాధ్యపడటం లేదని తెలుస్తోంది.

క్లుప్తంగా

పీహెచ్‌సీని సందర్శించిన ఢిల్లీ ప్రతినిధుల బృందం



బోనాలతో స్వాగతం పలుకుతున్న వైద్యసిబ్బంది

దౌల్తాబాద్‌: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఢిల్లీకి చెందిన ఎన్‌ఖాస్‌ సంస్థ ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా బృందం రెండు రోజుల పాటు స్థానిక పీహెచ్‌సీలోని వైద్యసేవలు, తదితర అంశాలపై తెలుసుకుంటారు. వారికి ముందుగా స్థానిక వైద్యసిబ్బంది ఏఎన్‌ఎంలు బోనాలతో స్వాగతం పలికారు. అనంతరం పీహెచ్‌సీలోని వైద్యసేవల గురించి వైద్యాధికారి రతన్‌లాల్‌ను అడిగి తెలుసుకున్నారు. రెండో రోజు కూడా వివిధ అంశాలపై తెలుసుకోనున్నట్లు వైద్యాధికారి తెలిపారు.

శుభప్రద్‌పటేల్‌ పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీసీ కమిషన్‌ సభ్యుడు తదితరులు

యాలాల: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కోకట్‌ గ్రామసర్పంచ్‌ ప్యాట హంసమ్మ కుటుంబ సభ్యులను సోమవారం బీసీ కమిషన్‌ రాష్ట్ర సభ్యుడు శుభప్రద్‌పటేల్‌ పరామర్శించారు. సర్పంచ్‌ మృతి చెందడం తనను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. అంతకు ముందు హంసమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌ భర్త శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ నారాయణరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయనతో పాటు మాజీ ఎంపీటీసీ అవుటి శంకర్‌, నాయకులు ఉన్నారు.

క్రమబద్ధీకరణపై విచారణ



ఇంటిని పరిశీలిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

కొడంగల్‌ : ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వాటిని క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్‌ 58, 59 ద్వారా ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం రెవెన్యూ ఉద్యోగులు పట్టణంలోని గాంధీనగర్‌, ఇంద్రనగర్‌ కాలనీల్లో పర్యటించారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటికి వెళ్లి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇంటి యజమానులను విచారించారు. ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించారు. విచారణ అనంతరం నివేదికను అధికారులకు సమర్పించనున్నట్లు రెవెన్యూ ఉద్యోగులు తెలిపారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ రామచంద్రరావు, వీఆర్‌ఏలు గోపాల్‌, శ్రీనివాస్‌, భానుచందర్‌, రమేష్‌ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో రెండేళ్ల జైలు

పరిగి: హత్యాయత్నం కేసులో నిందితుడికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించినట్టు ఎస్పీ కోటిరెడ్డి సోమవారం తెలిపారు. పరిగి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని బర్కత్‌పల్లిలో 2016 సంవత్సరంలో ఓ వ్యక్తి హత్యయత్నానికి ప్రయత్నించారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు వాదోపవాదాలు విన్న తరువాత సోమవారం వికారాబాద్‌ సెషన్‌ జడ్జి డీబీ శీతల్‌ నిందితునికి రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంకర్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కొత్తపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. చేవెళ్ల మండలం తంగేడుపల్లికి చెందిన దేవయ్య (39)నగరంలోని గచ్చిబౌలిలో హౌస్‌ కీపింగ్‌ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం గచ్చిబౌలికి బైక్‌పై వెళ్తూ ముందు వెళ్తున్న బైక్‌ను వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దేవయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



కంకరమయంగా మారిన ఎబ్బనూర్‌ రోడ్డు

కంకర పరిచారు.. కష్టాలు పెంచారు

కంకర రోడ్డు గుండా వెళ్లేందుకు వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. గుంతలమయంగా మారిన బీటీ రోడ్డును తవ్వేసి కొత్తగా నిర్మించేందుకు కంకరపరిచారు. రెండు నెలలైనా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. ధారూరు మండలం బాచారం గ్రామ సమీప పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి ఎబ్బనూర్‌ మీదుగా వికారాబాద్‌కు వెళ్లే రోడ్డులో వాహనదారులు చుక్కలు చూస్తున్నారు. 3 కిలోమీటర్ల ఈ రోడ్డుకు రూ.1.62 కోట్లు ఎంఆర్‌ఆర్‌ గ్రాంట్‌ కింద మంజూరయ్యాయి. పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్‌పై ప్రయాణికులు మండిపడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పనులను వేగవంతం చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– ధారూరు

మహిళ అదృశ్యం

పహాడీషరీఫ్‌: కుమారుడితో గొడవ పడిన ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ సంఘటన బాలాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. అల్జైన్‌ హిల్స్‌కు చెందిన అఫ్సారీ బేగం(46) ఉస్మాన్‌నగర్‌లోని సక్సెస్‌ స్టార్‌ స్కూల్‌లో కేర్‌ టేకర్‌గా పని చేస్తుంది. ఈ నెల 4వ తేదీన తన కుమారుడు హాజీతో చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె.. 5న ఉదయం పాఠశాలలకు వెళుతున్నానని చెప్పి ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం అన్ని ప్రాంతాలలో వెతికినా ఎక్కడా ఆచూకి లభించలేదు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో కానీ 87126 62366 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు



ఎల్లకొండ గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

- సమస్యలు తెలుసుకునేందుకే 'శుభోదయం'
- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవాబుపేట: బీఆర్‌ఎస్‌ పాలనలోనే ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుభోదయం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎల్లకొండ గ్రామంలో పర్యటించారు. వీధుల్లో తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. అలాగే సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రూ.కోటి 30 లక్షలతో అంతర్గత మురుగు కాలువలు, సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. అధికారులు ప్రజాప్రతినిధులు, ప్రజల మధ్య ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌ ప్రశాంత్‌ గౌడ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ రాంరెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సర్పంచులు శ్రీనివాస్‌ గౌడ్‌, బల్వంత్‌ రెడ్డి, నర్సింహులు, రత్నం, పరమయ , అంజయ్య, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మైతాప్‌ఖాన్‌గూడలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ప్రతి పంచాయతీకి పక్కా భవనం

కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలన్నింటికీ పక్కా భవనాలు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. మండల పరిధిలోని మైతాప్‌ ఖాన్‌ గూడ గ్రామంలో సోమవారం పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుబంధ గ్రామాలను, తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌ కే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాల ఆయాంలో అనుబంధ గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఆ విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి 500 జనాభా ఉన్న అనుబంధ గ్రామాలను, తండాలను గ్రామపంచాయతీలుగా మార్చారన్నారు. నేడు పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌ ప్రశాంత్‌ గౌడ్‌, ఎంపీడీవో సుమిత్రమ్మ, సర్పంచ్‌ అనిత రంగారెడ్డి, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ఆదుకుంటున్న రైతు బీమా

బాధిత కుటుంబాలకు ఆసరా

- ప్రీమియం చెల్లిస్తున్న ప్రభుత్వం
- దరఖాస్తు గడువు పెంపు
- ఆగస్టు 5 వరకు స్వీకరణ



వరి పొలంలో పనిచేస్తున్న రైతులు

కొడంగల్‌ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో రైతు బీమా పథకం బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. రైతన్న కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోంది. ఆరుగాలం కష్టించి పనిచేసే రైతులకు ఎలాంటి ఇన్సురెన్సులు ఉండవు. ఇంటి పెద్ద దిక్కు ఎలాంటి పరిస్థితుల్లో మరణించినా ఆ కుటుంబాల్లో తీరని శోకం మిగిలేది. మళ్లీ ఆ కుటుంబలు తేరుకోవాలంటే కొన్ని సంవత్సరాలు పట్టేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రైతులు ఎవరైనా చనిపోతే వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షలు బీమా డబ్బులు అందుతున్నాయి. ఆర్థికంగా ఆ కుటుంబాలకు ఉపశమనం కలుగుతుంది.

దరఖాస్తుకు గడువు పొడిగింపు

రైతు బీమా పథకానికి ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. గతంలో దరఖాస్తు చేయని వారు కొత్తగా భూమి కొనుగోలు చేసిన వారు వారి పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఎలాంటి ప్రీమియం లేకుండా భూమి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను సంబంధిత వ్యవసాయాధికారులకు ఇస్తే వారు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేస్తారు. ఈనెల 10వ తేదినుంచి ఆగస్టు 5వ తేది వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 5న చివరి గడువుగా ప్రకటించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ బీమా పథకం రైతు కుటుంబాలకు ధీమా ఇస్తోంది. ఏదైనా ప్రభుత్వ పథకం అందాలంటే పలుకుబడి ఉన్న వారితోనే సాధ్యం అయ్యేంది. కాని ఎలాంటి మధ్యవర్తులు లేకుండా రైతు బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. రైతు మరణించిన పది రోజుల్లోపు నేరుగా బాధిత కుటుంబంలో నామినీగా ఉన్న వ్యక్తి బ్యాంకు ఖాతాలో రూ.5లక్షలు జమ చేస్తున్నారు.

అంతా పారదర్శకం

రాష్ట్ర ప్రభుత్వం 2018 ఆగస్టు 15 నుంచి రైతు బీమా పథకాన్ని అమలు చేసింది. 18 సంవత్సరాల నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న రైతుల వివరాలను వ్యవసాయ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి అర్హులైన రైతులకు బీమా బాండ్లు అందజేశారు. రైతులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వమే ఎల్‌ఐసీకి రైతుల పేరున బీమా డబ్బులు చెల్లిస్తోంది. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కఠిన నిబంధనలు పెట్టారు. ఈ పథకంలో పేరు నమోదు అయిన రైతు ఏ కారణంతో మరణించినా బాధిత కుటుంబానికి బీమా సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. నామినీగా ఉన్న వారికి రూ.5లక్షల బీమా సొమ్మును బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు.

ఒక్కో రైతు ప్రీమియం రూ.3,555

పథకం ప్రారంభంలో ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.2,271 ప్రీమియం ఎల్‌ఐసీ సంస్థకు చెల్లించేది. 2019 నుంచి ప్రీమియం పెరగడంతో ప్రస్తుతం ఒక్కో రైతుకు రూ.3,555 చెల్లిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో రైతు బీమాను అమలు చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు ఇబ్బంది లేకుండా బీమా డబ్బులు చెల్లిస్తున్నారు. పారదర్శకంగా జవాబుదారీగా అమలు చేస్తున్న పథకాల్లో రైతు బంధు ఒకటని బాధిత కుటుంబ సభ్యులు అంటున్నారు.

కళాకారుల అభ్యున్నతికి పెద్దపీట



అయోధ్యపూర్‌ తండాలో పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌

షాద్‌నగర్‌: కళాకారుల అభ్యున్నతికి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గిరిజన కళాకారుడు సింగర్‌ మురళీ రచించి పాడిన ఎవరురా అంజన్నకు కాదు అనే వారు అనే పాటల సీడీని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది కవులు, కళాకారులు ఉన్నారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కళాకారుల పాత్ర ఎనలేనిదన్నారు. ప్రభుత్వం కళాకారుల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తోందన్నారు. అనంతరం గాయకుడు మురళీ మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌ చైర్మన్‌ ఈట గణేష్‌, నాయకులు విశ్వం, దేవేందర్‌ యాదవ్‌, రాంబల్‌ నాయక్‌, లక్ష్మణ్‌ నాయక్‌, శ్రావణ్‌కుమార్‌, బాలు నాయక్‌, సాయి ప్రసాద్‌ యాదవ్‌, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ హయాంలోనే అభివృద్ధి

కొందుర్గు: బీఆర్‌ఎస్‌ హయాంలోనే గ్రామాల రూపురేఖలు మారాయని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ అన్నారు. సోమవారం మండలంలోని బైరంపల్లి, లాలాపేట, చెరుకుపల్లి, విశ్వనాథ్‌పూర్‌, లక్ష్మీదేవిపల్లి, అయోద్యాపూర్‌ తండాల్లో నూతన పంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే బైరంపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌, ఉత్తరాసిపల్లిలో అండర్‌ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ముట్పూర్‌ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్‌ పుష్కలంగా నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ లాలయ్య, ఎంపీపీ జంగయ్య, వైస్‌ ఎంపీపీ రాజేష్‌ పటేల్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ దామోదర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్విఘ్నంగా కొనసాగుతున్న యాగాలు



పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

తాండూరు: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ రాజశ్యామల, శతచండి, సౌర, లక్ష్మీసుదర్శన సహితఅతిరుద్ర మహాయాగాలకు సోమవారం ఎనిమిదో రోజు భక్తులు పోటెత్తారు. శ్రీచక్ర నవావర్ణఅర్చన, శ్రీ రుద్ర సహిత కామాక్షి అమ్మవారికి విశేష సుగంధద్రవ్య అభిషేకాలు, సాయంత్రం రాజశ్యామల చండీసప్తహవనం జరిగాయి. పట్టణంలోని నగరేశ్వర దేవాలయంలో రోహిత్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి పలువురు పీఠాధిపతులు, మఠాధిపతులు యాగ క్రతువులో పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏలో ఉన్నతాధికారుల బదిలీలు

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ ప్లానింగ్‌ విభాగం డైరెక్టర్లు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఎంఏయూడీ ప్లానింగ్‌ డైరెక్టర్‌గా అలాగే హెచ్‌ఎండీఏ ప్లానింగ్‌–1 ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఉన్న ఎస్‌.బాలకృష్ణను మెట్రో రైల్‌ ప్లానింగ్‌ ఆఫీసర్‌గా బదిలీ చేశా రు. అలాగే ఆయనకు రేరా కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. డీటీసీపీ డైరెక్టర్‌ గా ఉన్న కె.విద్యాధర్‌ హెచ్‌ఎండీఏ ప్లానింగ్‌ విభాగం డైరెక్టర్‌–1గా బాలకృష్ణ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

లింగ వివక్ష వద్దు.. నియంత్రణే ముద్దు

- ప్రతియేటా 15 శాతం జనాభా పెరుగుదల
- నేడు జనాభాదినోత్సవం



బొంరాస్‌పేట: ప్రజలు పెరిగినంతగా పుడమి పెరగదనే నగ్న సత్యాన్ని తెలుసుకున్నప్పటికీ జనాభా పెరుగుదలకు అడ్డు కట్టవేయలేకపోతున్నారు. ఒకప్పుడు పల్లెలు, పట్టణాలు ఖాళీఖాళీగా ఉండేవి. ఇప్పుడు స్థలాలను గుర్తుపట్ట లేనంత జనాభా నిండిపోతున్నాయి. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తున్నప్పటికీ మగ సంతానం కోసం జనాభాను పెంచుతూనే ఉన్నారు. పట్టణాల్లో లింగనిర్ధారణ పరీక్షలను ఆపేందుకు చట్టరీత్యా చర్యలున్నప్పటికీ స్కానింగ్‌ సెంటర్లలో నిర్ధారణ కోసం క్యూలు ఉంటూనే ఉన్నాయి. స్కానింగ్‌ సెంటర్‌పై అధికారుల దాడిచేసినట్టు ఎక్కడా దాఖలాలు కూడా లేకపోతున్నాయి. మండలంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 58,037 కాగా ఇప్పటి వరకు 60 వేలకుపైగా దాటిందని తెలుస్తోంది. సంవత్సరానికి 15 శాతం పెరుగుతున్న జనాభాకు ప్రతి ఏటా 5శాతం జనాభా పెరుగుదల తోడవుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆచారాలు, సంప్రదాయాలు

గ్రామాల్లో ముఖ్యంగా ముస్లింలు, ఇతర అక్షరాస్యత తక్కువగా ఉన్న కులాల్లో జనాభా నియంత్రణను పెద్దగా పట్టించుకోవడం లేదు. వారి సంతతిని పెంచుకునే దిశగా ఆలోచన ఉండడంతో పెరిగిన జనాభా పెరుగుదలతో పేదరికం తదితర అనర్థాలు ఎదుర్కొంటున్నామని తెలుసుకోలేకపోతున్నారు. దీనిపై ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు అవగాహన కల్పించేందుకు మరిన్ని చర్యలు అవసరం.

మగ బిడ్డ కోసం..

గ్రామాల్లో మగ బిడ్డ తమ వంశోద్ధారకుడని ఆడపిల్లలు అత్తవారింటే పరిమితమేనని నమ్మి కుటుంబంలో అధిక సంతాన భారాన్ని మోస్తున్నారు. గతంలో వలే పెద్ద ఆస్తులు సంపాదన లేకున్నప్పటికీ మగ బిడ్డ కోసం తాపత్రయ పడుతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. దీని వల్ల తమ పిల్లలను అధిక సంతాన భారంతో పోషించలేని స్థితికి చేరుకొంటున్నారు. బాలలను చదువుకు దూరం చేసి మరింత అజ్ఞానంలో కూరుకుపోతున్న ప్రమాదం ఉంటుంది. ప్రభుత్వ పథకాలు ప్రభుత్వం ఆడ బిడ్డ సంరక్షణ పథకం లాంటి పలు పథకాలను ప్రవేశపెడుతూ జనాభా పెరుగుదల నియంత్రించేందుకు కృషి చేస్తుంది. స్కాలర్‌ షిప్‌లు తదితర ప్రభుత్వ సదుపాయాలను అందిస్తోంది. ఇద్దరు సంతానం ఉన్నవారికి పలు ప్రభుత్వ సదుపాయాల్లో రాయితీ కల్పిస్తోంది. ప్రజా ప్రతినిధులైన సర్పంచు ఎంపీటీసీల్లో ఇద్దరు సంతానం ఉన్నవారికే పోటీచేసే అవకాశం ఇప్పటికీ అమలులో ఉంది.

అవగాహన అవసరం



ఆరోగ్యం, ఆర్థిక, మానసిక విషయాల్లో ఆనందంగా ఉండాలంటే అది చిన్న కుటుంబానికే సాధ్యం కుటుంబ నియంత్రణ అందరిలో చాలా ముఖ్యం గ్రామీణ ప్రాంతాల్లో సెంటిమెట్లు విడవాలంటే ప్రజలకు అవగాహన ఇంకా అవసరం. నాకు ఇద్దరు కూతుర్లే. ఉన్నతంగా చదివించా.

– హన్మంతు, ట్యాబ్‌టెక్నీషన్‌, రేగడిమైలారం

ఇద్దరు హద్దు



నేను నిరుద్యోగిని. రైతుగా జీవిస్తూ నాకున్న అవగాహన మేరకు ఇద్దరు పిల్లల వరకే కుటుంబ నియంత్రణ పాటించా. కొడుకు, కూతురును ఇంగ్లిష్‌ మీడియంలో చదివించిన. ప్రతి రైతు కుటుబంలో కుటుంబ నియంత్రణ పై అవగాహన ఉండి ఇద్దరు పిల్లల వరకే సంతానాన్ని హద్దుగా గుర్తిస్తే కుటుంబం అంతా ఆనందమే.

– గిరేందర్‌గౌడ్‌, రైతు, తుంకిమెట్ల

ఆడపిల్లల కోసం వద్దన్నారు



ఆడబిడ్డ, మగబిడ్డ అనే సెంటిమెంట్లు గ్రామాల్లో చాలా ఉంటాయి. మహిళలపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. నాకు ఇద్దరు కొడుకులే. ఆడబిడ్డ కోసం ఆపరేషన్‌ వద్దన్నారు. కాని ప్రభుత్వం అప్పుడు 'ఆడైనా మగైనా ఒక్కరు ముద్దు.. ఇద్దరు హద్దు'అనే నినాదంతో కుటుంబ నియంత్రణ పాటించాం. బాగా చదివిస్తున్నాం.

– పావని, గృహిణి, చౌదర్‌పల్లి

జనాభా సమతుల్యత అవసరం



జనాభా ఎక్కువైనా నష్టమే. ప్రతి ఉద్యోగికి కుటుంబ నియంత్రణ నిబంధన తేవాలి. ఎంతఉద్యోగం ఉన్నా కుటుంబమైన పెద్ద కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. ఉద్యోగిగా ఉన్నప్పటికీ నిర్లక్ష్యాస్యులైన కుటుంబానికి తేడాలేకుండా ఎక్కువ మంది పిల్లల్ని కనడం ఎంత వరకు సమంజసం. ఇద్దరు పిల్లలతో ఆదర్శంగా ఉండాలి.

– రవీందర్‌గౌడ్‌, ఉపాధ్యాయుడు

తల్లిదండ్రుల చెంతకు బాలుడు

శంకర్‌పల్లి: తప్పిపోయిన బాలుడిని గంట వ్యవధిలో శంకర్‌పల్లి పోలీసులు తల్లిదండ్రులను అప్పగించారు. పోలీసుల కథనం మేరకు.. శంకర్‌పల్లి చౌరస్తా వద్ద సోమవారం ఉదయం 11గంటలకు ఓ బాలుడు ఏడుస్తూ ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. ఎంత సేపు చూసినా బాలుడి కోసం ఎవ్వరూ రాకపోవడంతో శంకర్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌లో అప్పగించారు. బాలుడు వివరాలు, పోలీస్‌ స్టేషన్‌లో ఉన్న విషయాన్ని సోషల్‌ మీడియా, వాట్సాప్‌ గ్రూపుల్లో పోస్ట్‌ చేశారు. విషయం తెలుసుకున్న బాలుడు తల్లిదండ్రుల పోలీస్‌ స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో బాలుడు సిద్ధిక్‌(4)ను తల్లిదండ్రులు వేణుగోపాల్‌, కళావతికు అప్పగించారు.

నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

మొయినాబాద్‌: మహిళలకు స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపా ధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీ) డైరెక్టర్‌ కె.రమేష్‌ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరు మహిళా ప్రాంగణం ఆవరణలో ఉన్న ఎస్‌బీఐ ఆర్‌సెటీ కేంద్రంలో మహిళలకు టైలరింగ్‌, మగ్గం వర్క్స్‌ కోర్సుల్లో ఈ నెల 18 నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల వయసు ఉండి పదో తరగతి చదివిన మహిళలు ఈ నెల 17 వరకు చిలుకూరులోని ఎస్‌బీఐ ఆర్‌సెటీ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 86390 79122, 79819 51167, నంబర్లలో సంప్రదించాలని సూచించారు.